సాక్షి సూర్యాపేట

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



కొండపై భక్తుల ఘర్షణ

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండ పైన బస్టాండ్‌లో బస్సులోని సీట్ల విషయమై భక్తులు ఘర్షణ పడ్డారు.

- 8లో



రెండేళ్లలో రిటైర్‌మెంట్..

లింగగిరి జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు పీవీ దుర్గాప్రసాద్ 59 ఏళ్ల వయస్సులో టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

- 8లో



యాదాద్రిలో ప్రత్యేక క్యూలైన్

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా యాదాద్రిలో ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటుపై అధికారులు దృష్టిసారించారు.

- 8లో

న్యూస్‌రీల్

డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్, యాప్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

జూన్ 12 వరకు పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

దురాజ్‌పల్లి(సూర్యాపేట) : జూన్ 12వ తేదీ వరకు 584 అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటరావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన ఆదర్శ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ముందుగా అన్ని పాఠశాలల్లో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటి వరకు 572 పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు చేశారని, 12 పాఠశాలల్లో ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. అన్ని పాఠశాలల్లో 100శాతం పనులు మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, బీఎస్ లత, డీఈఓ అశోక్, నోడల్ అధికారులు, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అన్ని మతాలకు స్వేచ్ఛాయుత వాతావరణం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్రంలో అన్ని మతాలకు స్వేచ్ఛాయుత వాతారణాన్ని కాంగ్రెస్ పార్టీ కల్పించిందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణ పరిధిలోని కాశీంపేట 4వ వార్డులోని అక్సా మసీద్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. ఎవరెన్ని దుష్ప్రచారాలు చేసిన హిందూ ముస్లిం భాయ్ భాయ్ అనే నినాదంతోనే ముందుకు సాగాలన్నారు. 14 శాతం నిధులను మైనార్టీలకు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కమిటీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, స్థానిక కౌన్సిలర్ జాటోతు లక్ష్మిమకట్ లాల్, ధారవత్ నాగునాయక్, పులిప్ దాస్, సలీంఖాన్, సిద్దీఖ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి మార్కెట్‌కు 39,762 బస్తాల ధాన్యం



తిరుమలగిరి మార్కెట్‌కు వచ్చిన ధాన్యం రాశులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు 39762 బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ వెల్లడించారు. గరిష్టంగా క్వింటాకు రూ.1,989, కనిష్టంగా రూ. 1,659 ధర పలికినట్లు వివరించారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా మార్కెట్‌కు ధాన్యాన్ని తీసుకు రావడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎండ తీవ్రత ఉండటంతో పాటు కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యంగా కాంటాలు అవుతుండటంతో రైతులు మార్కెట్ బాట పడుతున్నారు.

రెండు రోజులు సెలవు

రంజాన్ పర్వ దినాన్ని పురస్కరించుకొని ఈ నెల 11, 12 తేదీల్లో తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు సెలవు దినాలుగా ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. తిరిగి మార్కెట్ ఈ నెల 13వ తేదీన తెరుచుకోనున్నట్లు పేర్కొన్నారు.

మనమే గెలవాలి..!

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

- ఈ ఎన్నికల్లో పనిచేసే వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం
- 12వ తేదీ నుంచి అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాలు
- 19 నుంచి 46 మండలాలు, 16 మున్సిపాలిటీల్లో ర్యాలీలు
- 21న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్
- గెలుపు బాధ్యత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపైనే..



తన నివాసంలో జరిగిన భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ సమీక్ష సమావేశానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు సామేలు, అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు తదితరులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'భువనగిరి లోక్‌సభ స్థానం మనమే గెలవాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ప్రజలు కాంగ్రెస్ పార్టీని విశ్వసించి ఓట్లేసి గెలిపించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నాం. దేశంలో రాహుల్‌గాంధీ ప్రధాని అయితే మరింత అభివృద్ధి చెందుతాం. కాబట్టి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం మనపైనే ఉంది' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపు వ్యూహాలపై చర్చించి దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసేలా సిద్ధం చేయాలని, భారీ మెజారిటీతో గెలుపొందేలా కార్యాచరణ అమలు చేయాలని సూచించారు.

పనిచేసే వారికే ప్రాధాన్యం

ఈ ఎన్నికల్లో బాగా పనిచేసే వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేసినట్లు తెలిసింది. మే నెలాఖరు లేదంటే జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించబోతున్నందున పార్టీ కోసం పనిచేసే వారిని పరిగణనలోకి తీసుకునేలా కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. ఎన్నికల్లో ప్రభావితం చేయగలిగిన నియోజకవర్గ, మండల స్థాయి బీఆర్‌ఎస్ నాయకుల చేరికలను ప్రోత్సహించాలని సూచించినట్లు తెలిసింది. అయితే కాంగ్రెస్ పార్టీ నేతలు చురుగ్గా పనిచేసే చోట కాకుండా, అభ్యంతరం లేని మిగతా ప్రాంతాల్లో వారిని ప్రోత్సహించడం ద్వారా ఎన్నికల్లో మెజారిటీని పెంచుకునే వ్యూహంతో ముందుకు సాగాలని చెప్పినట్లు తెలిసింది.

12వ తేదీ నుంచి విస్తృత కార్యక్రమాలు

ప్రభుత్వం అమలు చేసిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ప్రజల్లో కాంగ్రెస్‌పైనే విశ్వాసం ఉన్నందున ఆ విశ్వాసాన్ని ఓట్ల రూపంలో పొందాలని, ఇందులో భాగంగా ఈ నెల 12వ తేదీ నుంచి విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

- 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు.
- 12వ తేదీన జనగామ, 13న ఆలేరు, 14న తుంగతుర్తి, 15, ఇబ్రహీంపట్నం, 16న భువనగిరి, 17న నకిరేకల్, 18న మునుగోడులో సమావేశాలను నిర్వహించనున్నారు.
- 19వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు 46 మండలాలు, 16 మున్సిపాలిటీల్లో ర్యాలీలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.
- 21వ తేదీన ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. వచ్చే నెల 4 నుంచి 6 తేదీల మధ్య భారీ బహిరంగ సభ నిర్వహించాలని, ఈ సభలో ప్రియాంక గాంధీ పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రాజగోపాల్‌రెడ్డిపైనే బాధ్యత

భువనగిరి లోక్‌సభ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు బాధ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపైనే పెట్టారు. గతంలో పార్లమెంట్ సభ్యునిగా పనిచేసిన రాజగోపాల్‌రెడ్డికి ఆ నియోజకవర్గంపై పట్టుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భువనగిరి లోక్‌సభ సభ్యునిగా తాజాగా ప్రాతినిధ్యం వహించారు. ఆయన గెలుపులోనూ రాజగోపాల్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం భువనగిరి టికెట్ విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజగోపాల్‌రెడ్డితో చర్చించిన తర్వాతే చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు బాధ్యతలను కూడా రాజగోపాల్‌రెడ్డికే అప్పగించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని నేతలందరి సమన్వయంతో భారీ మెజారిటీతో గెలిపించుకురావాలని ఆయన సూచించారు. రేవంత్‌రెడ్డితో సమావేశం అనంతరం రాజగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని 2 లక్షల మెజారిటీతో గెలిపించుకుంటామని చెప్పారు.

• నేడు ఈద్ – ఉల్ – ఫితర్



సూర్యాపేట పట్టణ పరిధిలోని గాంధీనగర్‌లో ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా



నెలవంక దర్శనంతో బుధవారం సాయంత్రం రంజాన్ ఉపవాస దీక్షలు ముగిశాయి. 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు కొనసాగించిన ముస్లింలు గురువారం ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్ పండుగ)ను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రత్యేక ప్రార్థనల కోసం జిల్లాలోని ఈద్గాలు, మసీదుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇమామ్‌లు ఈద్-ఉల్-ఫితర్ గురించి ఉపదేశించి, ఖుద్బా పఠిస్తారు.

'ధరణి'తో బురిడీ!

- పోర్టల్ వెసులుబాటును అనుకూలంగా మార్చుకుంటున్న 'రియల్' వ్యాపారులు
- లే అవుట్ అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయం
- గుంటల లెక్కన వ్యవసాయ భూమిగా రిజిస్ట్రేషన్, ఆపై మ్యుటేషన్
- నాలా కన్వర్షన్ కూడా గుంటల్లోనే ఇస్తున్న అధికారులు
- ప్రభుత్వ ఖజానాకు గండి.. మోసపోతున్న అమాయకులు



కోదాడ నియోజకవర్గ పరిధిలోని మునగాలలో ఓ రాజకీయ నేత, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కలిసి 20ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేశారు. వీటికి లే అవుట్, గ్రామ పంచాయతీ అనుమతులు, డీటీసీపీ అప్రూవల్ కానీ లేవు. ఈ వెంచర్‌లోని ప్లాట్లను రెండు గుంటలు (242 గజాలు) వ్యవసాయ భూమిగా పలువురికి రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన నాలా కన్వర్షన్ ఫీజు, పంచాయతీకి రావాల్సిన 10శాతం భూమి ఇవ్వకుండా, వెంచర్‌లో కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమ్మకాలు పూర్తి చేశారు. ఆ తర్వాత ఈ ప్లాట్లకు రెవెన్యూ అధికారులు ఒకగుంట, రెండు గుంటల్లో నాలా కన్వర్షన్‌కు అనుమతులు ఇస్తూ వచ్చారు. ఇక్కడ ఎకరం వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చడానికి 24విడతలుగా (రెండుగుంటలకు ఒకసారి చొప్పున) నాలా కన్వర్షన్ ఇచ్చారు.

కోదాడ: ధరణి పోర్టల్‌లోని వెసులుబాటును రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుని ప్రభుత్వాన్ని, ప్లాట్ల కొనుగోలు దారులను బురిడీ కొట్టిస్తున్నారు. ఫామ్‌ల్యాండ్ వెంచర్ల పేరుతో ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ సామాన్యులను సైతం నిలువునా ముంచుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఈ దందా ప్రస్తుతం జోరుగా సాగుతోంది. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగిస్తే ప్రభుత్వానికి నిర్ణీత రుసుం చెల్లించి నాలా కన్వర్షన్ చేయించుకోవాలి. ఆ భూమిలో వెంచర్ ఏర్పాటు చేస్తే తప్పని సరిగా పంచాయతీ, మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకోవాలి. సామాజిక అవసరాలకు 10శాతం భూమి ఇవ్వాలి. రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించాలి. ఆ తరువాత డీటీసీపీ(డైరెక్టర్ ఆఫ్ కంట్రీ అండ్ టౌన్ ప్లానింగ్) అనుమతులు తీసుకోవాలి. అప్పుడు మాత్రమే దీనిలో ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయడానికి వీలవుతుంది. ఇదంతా ఖర్చుతో కూడుకున్న పనులు కావడంతో వీటిని తప్పించుకోవడానికి ధరణి పోర్టల్ వెసులుబాటుతో మోసగిస్తున్నారు.

మోసం ఇలా..

ధరణి పోర్టల్ అమలులోకి వచ్చిన తరువాత దానిలో ఎంత తక్కువ భూమి విస్తీర్ణం ఉన్నా రిజిస్ట్రేషన్ చేసే అవకాశం ఉంది. వెంటనే మ్యుటేషన్ చేసే వీలు కూడా ఉంది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి దానిలో 24అడుగుల రోడ్లతో ప్లాట్లను ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం ఏలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. (నిబంధనల ప్రకారం వెంచర్‌లో 33 అడుగుల రోడ్లు వేయాలి). దీనికి నాలా కన్వర్షన్, పంచాయతీ అనుమతులు కూడా తీసుకోవడంలేదు. ఆ తరువాత ప్లాట్లను రెండు గుంటలలో(242 గజాలు) వ్యవసాయ భూమిగా కొన్నవారి పేరుతో రిజిస్ట్రేషన్, వెంటనే మ్యుటేషన్ చేయిస్తున్నారు. వీటిలో కొన్ని రకాల చెట్లను కూడా పెంచుతూ వాటి ద్వారా రూ.లక్షల ఆదాయం వస్తుందని నమ్మబలుకుతున్నారు. ఈ రెండు గుంటలకు పట్టాదారు పాసు పుస్తకంతో పాటు రైతుబంధు డబ్బులు కూడా వస్తుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెప్పినట్లు కొనుగోలు దారులు కూడా వింటున్నారు.

గుంటల భూములకు నాలా కన్వర్షన్ ఇవ్వొద్దు



ఫాంల్యాండ్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేస్తున్న దందాకు ఫుల్‌స్టాప్ పెట్టాలంటే రెవెన్యూ అధికారులు గుంట భూమికి నాలా కన్వర్షన్ ఇవ్వొద్దు. భూమి విస్తీర్ణం కనీసం అరెకరం లేదా ఎకరం ఉన్నప్పుడు మాత్రమే నాలా కన్వర్షన్ ఇస్తామంటే ఈ దందాను అరికట్టవచ్చు. దీనివల్ల అక్రమ వెంచర్లు, ఇరుకు రోడ్లు, సామాజిక అవసరాలకు స్థలం లేకపోవడం వంటి సమస్యలు రాకుండా చూడవచ్చు.

– కుదరవెల్లి బసవయ్య, సామాజిక కార్యకర్త

ఇల్లు కట్టాలంటే ఎన్ని ఇబ్బందులో..

ఈ వెంచర్లలో ప్లాట్లను కొన్న వారు వాటిలో ఇల్లు కట్టుకోవడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముందుగా సదరు ప్లాట్ వ్యవసాయ భూమిగా ఉండడంతో దాన్ని నాలా కన్వర్షన్ చేయించుకోవాలి. ప్లాట్ రెగ్యులరైజేషన్ పేరుతో మరి కొంత చెల్లించాల్సి వస్తుంది. డీటీసీపీ అనుమతులు లేకపోవడం వల్ల బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వడం లేదు. ఇవేవీ తెలియని అమాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాయమాటలకు మోసపోయి ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు మాత్రం రూ.లక్షలు గడిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి హరిచందన, చిత్రంలో సూర్యాపేట కలెక్టర్ వెంకటరావు, ఎస్పీలు రాహుల్ హెగ్డే,చందనా దీప్తి, అదనపు కలెక్టర్లు ప్రియాంక, లత, శ్రీనివాస్

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల్లో గట్టి నిఘా ఉంచాలి
- ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం
- నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ హరిచందన

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : లోక్ సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరిచందన సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, నియమించిన బృందాలతో ఏర్పాటు చేసిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావుతో కలిసి ఆమె మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకపరిధిలో జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయని, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తుంగతుర్తి అసెంబ్లీ నియోకవర్గంలోని 6 మండలాలు ఉన్నాయని వివరించారు. ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని అన్నారు. జిల్లాలో 729 ప్రాంతాల్లో 1,201 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుర్తించిన 163 ప్రాంతాల్లో 238 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో గట్టి నిఘా ఉంచాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పిస్తున్నాం

సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలోని 1,201 పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. వేసవి దృష్ట్యా చెక్ పోస్టుల్లో తనిఖీలు చేపట్టే బృందాలకు తాగునీరు, కూలర్, మరుగుదొడ్ల సదుపాయం కల్పించనున్నట్లు వివరించారు. జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నామన్నారు. నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ అన్ని చెక్ పోస్టుల్లో గట్టి నిఘా ఉంచాలన్నారు. అంతకు ముందు వ్యవసాయ మార్కెట్ గోదాంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌ను పరిశీలించారు. తదుపరి మీడియా సెంటర్, సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్, ఎలక్షన్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ను పరిశీలించారు. ఈ సమావేశంలో సూర్యాపేట అదనపు కలెక్టర్లు ప్రియాంక, బీఎస్. లత, నల్లగొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా, ఏఎస్పీ నాగేశ్వర రావు, సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, డీఏఓ సతీష్ కుమార్, డీసీఓ పద్మ, ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేశాన్ని దోచుకుతింటున్న బీజేపీ ప్రభుత్వం



అర్వపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

అర్వపల్లి: పదేళ్లుగా దేశాన్ని బీజేపీ ప్రభుత్వం దోచుకుతింటోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎం.డి. జహంగీర్ గెలుపు కోసం అర్వపల్లిలో బుధవారం నిర్వహించిన ఆపార్టీ తుంగతుర్తి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేట్ పరం చేస్తూ ప్రజలపై భారాలు మోపుతూ దేశ సమైక్యత, సమగ్రతను దెబ్బతీస్తూ భారత రాజ్యాంగానికి బీజేపీ తూట్లు పొడుస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. అవినీతి చేసిన వారిని బీజేపీలో చేర్చుకుంటూ నీతిమంతులుగా చేస్తోందని దుయ్యబట్టారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, ఎంపీ అభ్యర్థి ఎం.డి . జహంగీర్, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, ఎం. వెంకటేశ్వర్ రావు, కోట రమేష్, పిట్టల రవి, యాకలక్ష్మి, భూపతి వెంకటేశ్వర్లు, జగదీష్, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, సోమన్న, మధు, బుర్ర శ్రీనివాస్, పులుసు సత్యం , కందాల శంకర్‌రెడ్డి, భాస్కర్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు

దురాజ్‌పల్లి(సూర్యాపేట): రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు కలెక్టర్ వెంకటరావు బుధవారం శుభాకాంక్షలు తెలియజేశారు. వేసవిలోనూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నియమ నిష్ఠలతో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు ఉండడం గొప్ప విషయమని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు సంఖసంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

సూర్యాపేట: త్యాగానికి, మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ కేసుల పేరుతో టైమ్‌పాస్ చేస్తున్న కాంగ్రెస్

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, వేదికపై అభ్యర్థి కృష్ణారెడ్డి, నేతలు

సూర్యాపేట: పాలన చేతకాక అక్రమ కేసుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం టైమ్‌పాస్ చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం సూర్యాపేటలో నిర్వహించిన నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ డెడ్ స్టోరేజ్‌లో కూడా ఆయకట్టు కింద నీళ్లు ఇచ్చి కాపాడిన ఘనత కేసీఆర్‌దే అని గుర్తు చేశారు. కాళేశ్వరంలో మూడు పిల్లర్లు కుంగితే కేసీఆర్‌ది తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. కేసీఆర్‌కు ఎక్కడ ఆదరణ లభిస్తుందోనన్న భయంతో కాళేశ్వరంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ సూర్యాపేటకు వచ్చి, రైతుల వద్దకు రాగానే వెంటనే కాళేశ్వరం బాహుబలి మోటార్లు ఆన్‌చేసి నీళ్లు ఇచ్చారని పేర్కొన్నారు. గుజరాత్ మోడల్ అంటేనే వినాశనం, విధ్వంసమే బీజేపీ పాలసీ అని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ జాతీయ పార్టీలకు ఎంపీ అభ్యర్థులు దొరకడం లేదన్నారు. అందుకే కేసీఆర్ తయారు చేసిన నాయకులను పార్టీలోకి గుంజుకొని టికెట్లు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిస్తేనే ప్రభుత్వం అహంకారం తగ్గుతుందన్నారు.

క్లుప్తంగా

సంతానం కోసం పుత్రకామేష్టి యాగం



సాక్షి, హైదరాబాద్ : నవమితో పాటు పుష్యమీ నక్షత్రం కలిసివస్తున్న ఈ నెల 17న మెదక్ జిల్లా నర్సాపూర్‌లో పుత్ర కామేష్టి యాగం నిర్వహిస్తున్నట్లు సువిజ్ఞాన ఆశ్రమం నిర్వాహకులు సత్యవీర్ గురూజీ తెలిపారు. మారిన జీవన విధానాలతో సంతానలేమి సమస్యగా మారిన నేపథ్యంలో ప్రత్యేకంగా ఆడ, మగ బిడ్డల సంతానం కలిగేందుకు అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో పుత్ర కామేష్టి యాగం నిర్వహిస్తామని తెలిపారు. సంతానం కోసం ఎదురుచూస్తున్న వారు తమ వివరాలను 9248828666 లేదా 7981750006 నంబర్లలో నమోదు చేసుకోవాలని సత్యవీర్ గురూజీ కోరారు.

నగల దుకాణంలో చోరీ



దుకాణంలో వివరాలు సేకరిస్తున్న సీఐ చరమందరాజు, ఎస్ఐ సైదులు

గరిడేపల్లి : గుర్తుతెలియని నగల దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో జరిగింది. కీతవారిగూడెం గ్రామానికి చెందిన రాజేష్ నగల దుకాణం నడుపుతున్నాడు. రోజులాగానే మంగళవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం దుకాణం వద్దకు వచ్చి చూడగా చిన్న షెట్టర్ పైకి లేపి ఉండడంతో పాటు లోపల వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ చరమందరాజు, ఎస్ఐ సైదులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి రూ.2.20లక్షలు అపహరించినట్లు గుర్తించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు దాసి సుదర్శన్ సంస్మరణ సభ

మిర్యాలగూడ టౌన్ : చిత్రకారుడు, రచయిత దాసి సుదర్శన్ సంస్మరణ సభను ఈ నెల 12న మిర్యాలగూడలోని వాసవీభవన్‌లో నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ నటులు, దాసి, కోమరంభీమ్ ఫెం భూపాల్, విరాటపర్వం ఫేమ్, సినీదర్శకులు ఉడుగుల వేణుతో పాటు మాజీ జెడ్పీ చైర్మన్ సీడీ రవికుమార్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత పి.సుబ్బారావు, డీటీఎఫ్ నేత సోమయ్య హాజరవుతారని తెలిపారు. కళాకారులు, చిత్రకారులు, స్నేహితులు, ఉపాధ్యాయులు భారీగా తరలిరావాలని కోరారు.

యాదాద్రిలో ప్రత్యేక క్యూలైన్

- భక్తులకు ఇబ్బంది లేకుండా శాశ్వత షెడ్డు నిర్మాణం
- తూర్పు మాఢ వీధిలో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటుపై అధికారుల సన్నాహాలు



ఆలయ పశ్చిమ మాఢ వీధిలో చర్చిస్తున్న ఆనంద్‌సాయి, ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ భాస్కర్‌రావు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాలు, ఎండల బారినుంచి భక్తులు తప్పించుకునేలా ఆలయ పరిసరాల్లో శాశ్వత షెడ్డు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ధర్మదర్శనం, రూ.150 వీఐపీ ప్రత్యేక దర్శనం టికెట్ భక్తులు క్యూకాంప్లెక్స్ నుంచి ఒకే క్యూలైన్‌లో వస్తున్నారు. దీంతో ధర్మదర్శనంతో పాటు వీఐపీ టికెట్ కొనుగోలు చేసే భక్తులు సైతం ఒకే మార్గంలో రావడం ఏమిటని ఇటీవల ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో బుధవారం వైటీడీఏ సలహాదారు, ఆర్కిటెక్చర్ ఆనంద్‌సాయితో ఈఓ భాస్కర్‌రావు, సివిల్ అధికారులు దయాకర్‌రెడ్డి, డీఈఓ భాస్కర్‌శర్మలతో కలిసి ఆలయ తిరు, మాఢ వీధులు, ర్యాంప్ మార్గాలను పరిశీలించారు. కొండపైన వీఐపీ పార్కింగ్ ముందు గల ర్యాంప్ మార్గం నుంచి రథశాలకు కలిపి, అక్కడి నుంచి రూ.150 టికెట్ కొనుగోలు చేసే భక్తులను అనుమతిస్తే ఎలా ఉంటుందని అధికారులు చర్చించారు. ర్యాంప్ నుంచి రథశాల వద్దకు వచ్చి, అక్కడి నుంచి ఉత్తర, తూర్పు మాఢ వీధుల మీదుగా ప్రధానాలయంలోకి రూ.150 టికెట్ కొనుగోలు చేసే భక్తులను అనుమతి ఇచ్చేలా క్యూలైన్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని, ఏమైనా ఇబ్బందులు ఉంటాయా అనే విషయాన్ని మాట్లాడుకున్నారు. దీనిపై త్వరలోనే ఓ నిర్ణయానికి వచ్చే అవకాశాలున్నాయి. ఇక వేసవి, వర్ష కాలంలో భక్తులు ఇబ్బందులు కలుగకుండా నీడ ఉండే విధంగా ఆలయ నిత్య కల్యాణ మండపంతో పాటు పడమటి రాజగోపురం ముందు నుంచి ఉత్తర మాఢ వీధి, ప్రసాద విక్రయశాలకు వెళ్లె మెట్ల మార్గం వరకు శాశ్వత షెడ్డును ఏర్పాటు చేసేలా పరిశీలించారు. కృష్ణశిల రాయితో నిర్మాణం చేసిన ఆలయ సుందర రూపానికి అటంకం కలుగకుండా షెడ్డును వేయాలని నిర్ణయానికి వచ్చారు. ఆలయ తూర్పు మాఢ వీధిలో ఉన్న బ్రహ్మోత్సవ మండప సమీపంలో భారీ డిజిటల్ స్క్రీన్‌ను ఏర్పాటు చేయాలని స్థలాన్ని పరిశీలించారు. ప్రధానాలయంలో జరిగే స్వామి వారి పూజ కార్యక్రమాలను ఈ స్క్రీన్‌పై భక్తులు వీక్షించేలా ఏర్పాటు చేయడానికి ఆనంద్‌సాయితో ఈఓ చర్చించారు. త్వరలోనే ఈ పనులపై అధికారికంగా దేవాలయాల అధికారులు పనులు ప్రారంభించనున్నారు. భక్తులకు ఆధ్యాత్మికత, ఆహ్లాదం పంచేందుకు శుక్ర, శని, ఆదివారం రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

యాదాద్రి కొండపై భక్తుల ఘర్షణ



ఘర్షణ పడుతున్న భక్తులను సముదాయిస్తున్న ఎస్‌పీఎఫ్ పోలీసులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపైన గల బస్టాండ్‌లో పలువురు భక్తులు ఘర్షణ పడ్డారు. స్థానిక భక్తులు, ఎస్‌పీఎఫ్ పోలీస్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన రెండు కుటుంబాల భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బుధవారం కొండపైకి వెళ్లే బస్సు ఎక్కారు. సీట్లలో కూర్చునే క్రమంలో రెండు కుటుంబాల భక్తుల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ క్రమంలో ఓ మహిళ మరో మహిళ తీవ్ర పదజాలంతో దూషించుకుని ఘర్షణకు దిగారు. బస్సులోనే ఒకరిపై ఒకరు దాడి చేసుకొని కొండపైకి వచ్చారు. కొండపైన బస్టాండ్‌లో సైతం భక్తులు తీవ్ర ఘర్షణకు పాల్పడటంతో ఎస్‌పీఎఫ్ పోలీసులు, ఆలయ సిబ్బంది, తోటి భక్తులు కలుగజేసుకొని వారిని సముదాయించారు. ఎస్‌పీఎఫ్ పోలీసులు రెండు కుటుంబాల భక్తులను పట్టణ పోలీసులకు అప్పగించారు.

బొప్పారం చెరువులో చేపల మృతిపై విచారణ

కేతేపల్లి : మండలంలోని బొప్పారం ఊర చెరువులో చేపలు మృత్యువాత పడిన ఘటనపై నల్లగొండ జిల్లా మత్స్యశాఖ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. కలెక్టర్ హరిచందన ఆదేశాల ప్రకారం మత్స్యశాఖ అధికారి వెంకయ్య బొప్పారం చెరువులో మృతి చెందిన చేపలను పరిశీలించారు. స్థానిక మత్స్యకారులతో మాట్లాడి వివరాలు సేకరించి మాట్లాడారు. నాలుగు రోజులుగా ఎండ తీవ్రత, కాలుష్యకారకమైన మూసీ నీటి కారణంగా చేపలు మృత్యువాత పడినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. చెరువులో విష ప్రయోగం జరిగిందని వస్తున్న ఆరోపణల్లో ఆధారాలు లభించలేదని తెలిపారు. చెరువులో దాదాపు 5 టన్నుల చేపలు మృతి చెందినట్లు తెలిపారు. చెరువులో ఉన్న చేపలను త్వరగా పట్టుకొని విక్రయించుకోవాలని మత్స్యకారులకు సూచించారు. చేపల మృతి ఘటనపై కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట చేపల సొసైటీ చైర్మన్ అలువాల శ్రీను, ఉపాధ్యక్షులు జిన్నె జల్లస్వామి, కార్యదర్శి జిన్నె వీర మల్లయ్య ఉన్నారు.

దేవస్థానం నిర్ణయించిన ధరకే విక్రయించాలి

- కొబ్బరికాయల వ్యాపారులకు యాదాద్రి ప్రధానాలయ ఈఓ భాస్కర్‌రావు ఆదేశం



కొబ్బరికాయల వ్యాపారులతో మాట్లాడుతున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో వర్తక సంఘం ఏర్పాటు చేసుకున్న కొబ్బరి కాయలను దేవస్థానం టెండర్‌లో నిర్ణయించిన ధరకే భక్తులకు విక్రయించాలని ఈఓ భాస్కర్‌రావు ఆదేశించారు. ఇటీవల కొబ్బరి కాయలు అధిక ధరలకు అమ్ముతున్నారని భక్తుల నుంచి ఆలయాధికారుల ఫిర్యాదు అందాయి. దీంతో బుధవారం ఈఓ స్వయంగా కొబ్బరికాయల దుకాణాల వద్దకు వెళ్లి పరిశీలించారు. అధిక ధరలకు కొబ్బరి కాయలు విక్రయిస్తే టెండర్లు రద్దు చేస్తామని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవస్థానం నిర్ణయించిన ధరల పట్టికను కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రసాదాల తయారీ, అమ్మకాలను పరిశీలించారు. ప్రసాదంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత శాఖ అధికారులను హెచ్చరించారు. ప్రతి రోజు భక్తుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలు రాకుండా పరిష్కరిస్తామన్నారు.

నెమిలలో పార్శ్వనాథుని విగ్రహ శకలం లభ్యం



పార్శ్వనాథుడి విగ్రహ శకలం

రాజాపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని నెమిల గ్రామంలో బుధవారం కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కుండె గణేష్ జైనధర్మానికి చెందిన 23వ జైనతీర్థంకుడు పార్శ్వనాథుని విగ్రహ శకలాన్ని గుర్తించారు. 22వ జైనతీర్థంకరుడు నేమినాథుని పేరు మీదుగా నెమిల గ్రామం నామకరం పొందింది. లభ్యమైన విగ్రహశకలం కాయోత్సర్గభంగిమలో ఉంది. ఆజానుభాహుడైన పారర్శ్వనాథుని వెనక సుట్లు తిరిగిన ఏడు తలల సర్పం ఉన్న ఆనవాళ్లు కన్పిస్తున్నాయి. ఈ శిల్పం రాష్ట్ర కూటపాలకులు అమోఘవర్షుడు, 2వ కృష్ణుడు కొలనుపాక రాజధానిగా పాలించినప్పుడు నిర్మించారని తెలుస్తోంది. వారి కాలపు శాసనాలు రెండు గుండాల మండలంలోని వెల్మజాలలో లభించాయి. ఇప్పుడు ఈ విగ్రహం లభ్యం కావటంతో ఈ చరిత్రకు బలం చేకూర్చుతుంది.

రెండేళ్లలో రిటైర్‌మెంట్.. టెట్‌కు దరఖాస్తు

- జీఓటీ, ఏఓటీ పాసైన వారికి వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వ టీచర్ విజ్ఞప్తి



టెట్‌కు దరఖాస్తు చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలం లింగగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పీవీ దుర్గాప్రసాద్ 59 ఏళ్ల వయస్సులో బుధవారం టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 1989 బ్యాచ్‌కు చెందిన తాను పదేళ్లుగా ఎస్జీటీగా పనిచేసి 1999లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్‌తో పని చేస్తున్నానని తెలిపారు. గతంలో జీటస్, ఎగ్జిక్యూటివ్ టెస్ట్ పాసైనట్లు తెలిపారు. రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్న మాలాంటి ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రాయడం చాలా ఇబ్బందికరంగా ఉంటుందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జీఓటీ, ఏఓటీ పాసైన వారికి వెసులుబాటు కల్పించాలని కోరారు.

చెట్టును ఢీకొట్టిన ట్రాక్టర్.. బాలుడు మృతి



విశ్వతేజ(ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన కేశపోయిన శ్రీశైలం, సుకన్యల కుమారుడు విశ్వ తేజ(14) సూర్యాపేటలోని జయ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఉగాది పండుగ సెలవులకు గ్రామానికి వచ్చిన విశ్వతేజ గ్రామానికి చెందిన పబ్బతి గణేష్‌కు చెందిన ట్రాక్టర్‌తో డ్రైవర్ బొలక గణేష్ మట్టి తరలిస్తుండగా అతనితో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ తాను నడుపుతానని విశ్వతేజ కోరడంతో గణేష్ అతడికి ఇచ్చి పక్కనే కూర్చున్నాడు. ట్రాక్టర్ శంభుని చెరువు కట్టపైకి రాగానే అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్టీరింగ్ తగిలి విశ్వతేజకు తీవ్ర, గణేష్ స్వల్పంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం విశ్వతేజను 108లో సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సూర్యాపేట : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట పట్టణ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...పిల్లలమర్రి చెందిన ఇరుగు మల్లేష్(22) బైక్‌పై సూర్యాపేట నుంచి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రూ.1.30లక్షల నగదు స్వాధీనం

చిట్యాల: మండల పరిధిలోని వట్టిమర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిపై బుధవారం పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అనుమతులు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు పట్టుకున్నారు. వట్టిమర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.30లక్షల నగదును పట్టుకున్నారు. ఆ నగదును జిల్లా అధికారులకు అందజేసినట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

బైక్ చోరీ ఘటనపై కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): బైక్ చోరీ ఘటనపై బుధవారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న సూరారం గ్రామానికి చెందిన నార గోని శివశంకర్ ఏప్రిల్ 2వ తేదీ రాత్రి తన పల్సర్ బైక్‌ను రోజు మాదిరిగా ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి బైక్ లేదు. చుట్టూ పక్కల తెలిసిన ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.రాజు తెలిపారు.

వేధింపుల కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

సంస్థాన్ నారాయణపురం: వరకట్నం వేధింపుల కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ భువనగిరి జిల్లా మొదటి న్యాయమూర్తి మారుతిదేవి బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా .. సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురం గ్రామానికి చెందిన సయ్యద్ అస్మాకు జనగామ గ్రామానికి చెందిన సయ్యద్ షరీఫ్‌తో డిసెంబర్ 2018లో వివాహం జరిగింది. భర్త షరీఫ్, అత్తమామలు మౌలానా, ఫాతిమా వేధింపులు భరించలేక అస్మా 2019వ సంవతరం జూన్ 29న ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వాదపవాదనల అనంతరం నిందితులపై కేసు రుజువు కావడంతో ఐపీసీ సెక్షన్ 498(ఏ)304(బీ)ల ప్రకారం ఒక్కొక్కరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారని పోలీసులు తెలిపారు.

మునుగోడులో మైనర్లకు మద్యం విక్రయాలు !

- వ్యాపారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపణలు
- మైనర్లు పర్మిట్ రూంలో మద్యం తాగుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్
- ఎక్సైజ్ అధికారుల తీరుపై విమర్శలు



ముగోడులో ఓ మద్యం దుకాణంలోని పర్మిట్ రూంలో పెద్దలతో కూర్చున్న మైనర్లు

మునుగోడు: మద్యం వ్యాపారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఇష్టారాజ్యాంగా మైనర్లకూ విక్రయిస్తూ వారిని మద్యానికి బానిసలుగా మారుస్తున్నారనే ఆరోపణలు మునుగోడులో బలంగా వినిపిస్తున్నాయి. వ్యాపారులు ఏకంగా తమ దుకాణంలోని సిట్టింగ్ పర్మిట్ రూమ్‌లో కూర్చొని మద్యం తాగేందుకు సైతం అవకాశం కల్పిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని చౌటుప్పల్ రోడ్డులో గల ఓ మద్యం దుకాణం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల ఇదే దుకాణం పర్మిట్ రూంలో ఇద్దరు మైనర్లు, ఇద్దరు మేజర్లు మద్యం సేవించడాన్ని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌లో బంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయినా ఆ దుకాణం నిర్వాహకుల్లో ఎలాంటి మార్పు కన్పిచడం లేదని పలువురు వాపోతున్నారు. మైనర్లకు మద్యం విక్రయాలు కొనసాగించడంతో పాటు ఉదయం 10గంటల తరువాత తీయాల్సిన దుకాణాలు ఒక్కో రోజు గంట, అర గంట ముందే తెరవడం, రాత్రి సమయంలో గంట ఆలస్యంగా మూసివేస్తున్నారు. ఇవి సంబంధిత శాఖ అధికారుల దుకాణాలని ఎప్పటికప్పుడు పరివేక్షించకపోవడంతో పాటు నిబంధనలు అతిక్రమించినా చూసి చూడనట్లు వదిలేయడంతోనే వ్యాపారులు ఇలా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మునుగోడు మద్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అర్హతలేకుండా వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటాచలం
- కోదాడలో ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



కోదాడలో న్యూ నాగార్జున వైద్యశాలను సీజ్ చేస్తున్న అధికారులు

కోదాడ: అర్హతలేకుండా వైద్యం చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్ఓ కోటా చలం హెచ్చరించారు. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి, ఎంసీఐ స్క్రీనింగ్ టెస్ట్ పాస్‌కాకుండానే కోదాడలో వైద్యశాలలు నిర్వహిస్తూ, వైద్యం చేస్తున్న విషయాన్ని 'రోగుల ప్రాణాలతో చెలగాటం' శీర్షికన ఈ నెల 6న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం కోదాడలో పలు ప్రైవేట్ వైద్యశాలలను తనిఖీ చేశారు. అర్హత లేని వైద్యులతో నిర్వహిస్తున్న హుజూర్‌నగర్ రోడ్డులోని న్యూ నాగార్జున వైద్యశాలను సీజ్ చేశారు. అజాద్‌నగర్‌లో ఉన్న సాకేతకృష్ణ వైద్యశాలను తనిఖీ చేసి బోర్డుపై వైద్యుడి పేరు చివరన విద్యార్హతల్లో రాసుకున్న ఎండీ డిగ్రీని తొలగించాలని ఆదేశించారు. ఈ వైద్యశాలలో నిర్వహిస్తున్న ఫార్మసీలో ఫార్మసిస్ట్ లేడని ఈవిషయంపై జిల్లా ఔషధ నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. శ్రీ సాయిదుర్గ వైద్యశాలను తనిఖీ చేసి విదేశాల్లో చదివి స్క్రీనింగ్ టెస్ట్ పాస్‌కాకుండా వైద్యం చేస్తున్న డాక్టర్‌ను ప్రాక్టీస్ చేయవద్దని ఆదేశించారు. అనంతరం

సాక్షి ఎఫెక్ట్..

ఆయన మాట్లాడుతూ విదేశాల్లో చదివిన వారు తప్పనిసరిగా స్క్రీనింగ్ టెస్ట్ పాస్ అయిన తరువాతే ప్రాక్టీస్ చేయాలని, పేర్ల చివరన ఎండీ డిగ్రీలు పెట్టుకోవద్దని, నిబంధనలు పాటించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇదిలా ఉండగా అధికారులు విదేశాల్లో చదివి స్క్రీనింగ్ టెస్ట్ పాస్‌కాకుండా ప్రాక్టీస్ చేస్తున్న కొంత మంది వైద్యుల పట్ల ఉదారంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. కోదాడలో మరో ఐదు వైద్యశాలలు ఇదే విధంగా అర్హతలు లేని వారితో నిర్వహిస్తున్నా అధికారులు వారి జోలికి వెల్లకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్, డాక్టర్ పి. వెంకటరమణ, చంద్రశేఖర్, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలి


- కేవీకే డైరెక్టర్ ఘంటా అమరేందర్‌రెడ్డి



చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీపై శిక్షణ పొందుతున్న మహిళలు

గరిడేపల్లి : మహిళలు స్వశక్తితో ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవాలని కేవీకే డైరెక్టర్ ఘంటా అమరేందర్‌రెడ్డి సూచించారు. గడ్డిపల్లిలోని కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలకు చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఇస్తున్న శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆహారంలో చిరుధాన్యాలు ఉపయోగించటం వలన ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. కేవీకే ఇంచార్జి పోగ్రాం కో ఆర్డినేటర్ నరేష్ మహిళలు గ్రూప్‌గా ఏర్పడి ఇంటి దగ్గరే ఉండి చిరుధాన్యాలతో విలువాధారిత ఉత్పత్తులను తయారు చేసుకొని మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా ఉపాధి పొందవచ్చని తెలియజేశారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్. సుగంధి చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు మొదలైన వాటితో చేసుకోదగిన ఉత్పత్తులపై వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఎ. కిరణ్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన తిరుమలగిరి మున్సిపాలిటీ పాలకవర్గం



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాస గృహంలో బుధవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆధ్వర్యంలో తిరుమలగిరి మున్సిపాలిటీ పాలకవర్గం కలిసింది. సీఎంను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ త్వరలో జరిగే భువనగిరి పార్లమెంటులో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వైస్ చైర్మన్ కేశిడి సరళాయాదవరెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, జమ్మిలాల్, ఉుంకరి జనార్దన్, కందుకూరి లక్ష్మయ్య, దాచేపల్లి వెంకన్న, తిరుమని యాదగిరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో ఆకట్టుకున్న యక్షగాన ప్రదర్శన







బాలనాగమ్మ చరిత్ర యక్షగాన ప్రదర్శనలో సన్నివేశాలు

చౌటుప్పల్ : శ్రీక్రోధినామ తెలుగు సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను గ్రామీణ కళల పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చౌటుప్పల్‌లో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సేవాసమితి 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక చిన్నకొండూర్‌రోడ్‌లో కచ్చీరు (దొరవారి ఇల్లు) వద్ద బాలనాగమ్మ చరిత్ర యక్షగానం ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రామీణ కళాకారులు తమ వేషధారణలు, కళా ప్రదర్శనలతో ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నారు. పెద్ద సంఖ్యలో కళాభిమానులు తరలివచ్చారు. వివిధ రంగాల్లో విశిష్టంగా సేవలందించిన వారితో పాటు కళాకారులను ఘనంగా సన్మానించారు. గ్రామీణ కళల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పోలోజు శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి సైదులుగౌడ్, నిర్వాహక ప్రతినిధులు ఎరుకల మల్లేశం, చిక్క నర్సింహ, వీసం చంద్రారెడ్డి, సుర్కంటి వెంకట్‌రెడ్డి, దొడ్డి రాములు, బడుగు బాలరాజు, చిట్టిప్రోలు వెంకటేష్, చింతకింది అంజయ్య, గ్యార కిష్టయ్య, బొడిగె ప్రభాకర్, కొండూరు వెంకన్న, స్థానికులు బడుగు లక్ష్మయ్య, బత్తుల శ్రీశైలం, బొబ్బిళ్ల మురళి, బడుగు శ్రీరాములు, పోలోజు రాజుచారి, తాడూరి పరమేష్ ఉన్నారు.